APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్
నిజం దాగదు.. వార్త ఆగదు
తెలుగు దినపత్రిక

07.01.2026
బుధవారం
హైదరాబాద్
సంపుటి : 17 సంచిక: 78
పేజీలు: 4 వెల: రూ.5
ఎడిటర్ : రాథోడ్ వినోద్ కుమార్
Follow:
https://epaper.expresstelugudaily.com

పల్లె ప్రకృతి వనంలో ఇళ్ళ నిర్మాణంకు
## భూమి పూజ



03

# అసెంబ్లీలో హిల్ట్ సెగ!





భూముల మార్పిడిపై సర్కార్ వర్సెస్ ప్రతిపక్షం
పారిశ్రామిక భూముల మార్పిడిపై హోరాహోరీ చర్చ
పారిశ్రామికవేత్తలతో ప్రభుత్వం కుమ్మక్కైంది: ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపణ
పర్యావరణం పేరుతో రియల్ ఎస్టేట్ లాబీయింగ్.. అసెంబ్లీలో ప్రతిపక్షాల ధ్వజం
పేదల ఉపాధి మాటేమిటి? ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ప్రశ్న
మతలబు లేదు.. అంతా పారదర్శకం: విమర్శలకు మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్
గత ప్రభుత్వాలు అమ్మేసిన భూములకు మేము బాధ్యులమా?: మంత్రి సూటి ప్రశ్న
బడా బాబుల కోసం కాదు.. భావి తరాల ఆరోగ్యం కోసమే హిల్ట్: డిప్యూటీ సీఎం
అసెంబ్లీ వేదికగా ఆరోపణలు - కౌంటర్లు.. హిల్ట్‌పై ముగిసిన చర్చ

తెలంగాణ అసెంబ్లీ ఐదో రోజు సమావేశాల్లో 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫార్మేషన్' పాలసీపై అత్యంత కీలకమైన చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు భావోద్వేగంగా ప్రసంగిస్తూ.. హిల్ట్ పాలసీ కేవలం భూ వినియోగ మార్పిడి కాదని, ఇది రాబోయే తరాల మనుగడ కోసం ప్రభుత్వం వేస్తున్న ఆరోగ్యకరమైన పునాది అని స్పష్టం చేశారు. "మనం ఆకాశంలో ఇళ్లు కట్టుకోవాలని కలలు కంటున్నాం కానీ, ప్రాథమిక అవసరాలైన స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారాన్ని ఇవ్వలేకపోతున్నాం.

**హైదరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

పిల్లలకు వేల కోట్ల ఆస్తులు ఇచ్చి, తాగడానికి విషపూరితమైన నీరు, పీల్చడానికి కాలుష్య గాలిని ఇవ్వడం అంటే.. బంగారు గిన్నెలో విషం పెట్టి ఇచ్చినట్లే" అని ఆయన వ్యాఖ్యానించారు. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని నాశనం చేస్తే ఆ నష్టాన్ని ఎప్పటికీ పూడ్చలేమని, మనం ఈ భూమికి యజమానులం కాదని, కేవలం వారసత్వంగా వచ్చే సంపదను కాపాడే ట్రస్టీలమని గుర్తుచేశారు.

**హైదరాబాద్ మరో ఢిల్లీలా మారుతుంది..**

నగరం నడిబొడ్డున ఉన్న పరిశ్రమల వల్ల ఎదురవుతున్న ముప్పును వివరిస్తూ శ్రీధర్ బాబు కీలక గణాంకాలను సభ ముందుంచారు. 1970వ దశకంలో నగరం వెలుపల ఏర్పాటు చేసిన బాలానగర్, సనత్‌నగర్, ఉప్పల్, జీడిమెట్ల వంటి పారిశ్రామిక ప్రాంతాలు నేడు నివాసాల మధ్యకు వచ్చాయని తెలిపారు. "ఒక ఫ్యాక్టరీ గోడకు ఆనుకునే అపార్ట్‌మెంట్లు ఉండటం సైంటిఫిక్ డిజాస్టర్. భూగర్భ జలాల్లో హెవీ మెటల్స్ స్థాయిలు ఉండాల్సిన దానికంటే వెయ్యి శాతం ఎక్కువగా పెరిగాయి. ఇప్పటికీ మేల్కొకపోతే హైదరాబాద్ మరో ఢిల్లీలా మారుతుంది" అని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఓఆర్ఆర్ లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను క్రమంగా బయటకు తరలించి, ఆ భూములను నివాస, వాణిజ్య, ఇతర ఉత్పాదక ప్రాంతాలుగా మార్చడమే హిల్ట్ లక్ష్యమని వివరించారు. దశాబ్దాల క్రితమే గత ప్రభుత్వాలు అమ్మేసిన భూములను ఇప్పుడు పారిశ్రామికవేత్తల నుండి బలవంతంగా కాకుండా, వారు స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే ఆరు నెలల గడువులోగా కన్వర్ట్ చేస్తామని స్పష్టం చేశారు.

**బడా పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చేందుకే..**

బీజేపీ, ఎంఐఎం సభ్యులు ఈ పాలసీపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కాలుష్య నివారణ అనేది ఒక ముసుగు మాత్రమేనని, దీని వెనుక రియల్ ఎస్టేట్ లాభాల కోసం

మిగతా 2లో..

సింగరేణి కార్మికులకు
## కోటి భరోసా

- రూపాయి ఖర్చు లేకుండానే రూ. 1 కోటి ప్రమాద బీమా
- 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్ ల్యాబ్ ప్రారంభం
- రిటైర్డ్ ఉద్యోగులకు రూ. 8 లక్షల వరకు ఉచిత మందుల సౌకర్యం
- ఇళ్ల నిర్మాణంపై బోర్డుతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటాం
- త్వరలోనే సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు, మంత్రులతో ఉన్నత స్థాయి భేటీ
- బ్యాంకుల సహకారంతో ఆర్థిక భారం లేకుండానే బీమా పథకం అమలు
- శాసనసభ క్వశ్చన్ అవర్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



**హైదరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సింగరేణి కార్మికులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గుడ్ న్యూస్ చెప్పారు. సింగరేణి ఆసుపత్రుల్లో మార్చి నాటికి వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు. సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. తెలంగాణ శాసనసభ క్వశ్చన్ అవర్‌లో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) భవిష్యత్తు, పోటీ పరిస్థితులు, కార్మికుల ఉపాధి, భద్రతపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు

మిగతా 2లో..

## ఎరువుల కొరత లేదు.. రైతులకు ఆందోళన వద్దు!

- నేటి వరకు 4.52 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా విక్రయం
- యాప్ ద్వారా ఇప్పటివరకు 4.55 లక్షల యూరియా బస్తాల కొనుగోలు
- జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో డీలర్ల వారీగా స్టాక్ డాష్ బోర్డులు
- త్వరలో ఎమ్మెల్యేలకూ ఎరువుల 'డాష్ బోర్డు' యాక్సెస్: తుమ్మల
- అసెంబ్లీలో ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమాధానాలు

02



# హస్తం గూటికి కవిత?

మల్‌రెడ్డి రంగారెడ్డి వ్యాఖ్యలతో కలకలం
కవిత పార్టీ మారినా ఆశ్చర్యపోనక్కర్లేదని వ్యాఖ్యలు
రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చు.. మార్పులు సహజమన్న కాంగ్రెస్ నేత
గతంలో ఇతర నేతల చేరికను గుర్తు చేస్తూ కీలక కామెంట్స్
దానం, కడియం దారిలోనే అడుగులు.. రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్
మీడియా చిట్ చాట్‌లో మల్‌రెడ్డి రంగారెడ్డి సంచలన కామెంట్స్
నాకు మంత్రి పోస్ట్ ఇవ్వకపోతే నష్టం కాంగ్రెస్ పార్టీకే అంటూ అల్టిమేటం
పదవిపై పార్టీ పెద్దలు సీరియస్‌గా ఆలోచించాలని సూచన

**హైదరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం వేగంగా మారుతోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ కీలక నేత, ఎమ్మెల్సీ కవిత భవిష్యత్ రాజకీయాలపై కాంగ్రెస్ సీనియర్ నేత మల్‌రెడ్డి రంగారెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.

**కవిత చేరికపై ముందస్తు సంకేతాలు?**

ఓ చిట్ చాట్ కార్యక్రమంలో మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్‌లో చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. గతంలో బీఆర్ఎస్ నుంచి దానం నాగేందర్, కడియం శ్రీహరి వంటి ఉద్దండులు కాంగ్రెస్‌లోకి రావడం ఎవరూ ఊహించలేదని, ఇప్పుడు కవిత విషయంలోనూ అదే పునరావృతం కావచ్చని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరని చెప్పడం ద్వారా కవిత పార్టీ మార్పుపై ఆయన గట్టి సంకేతాలే ఇచ్చారు.

**జిల్లా రాజకీయాలు, మంత్రి పదవి డిమాండ్**

రంగారెడ్డి జిల్లా రాజకీయాలపై మల్‌రెడ్డి తన గళం విప్పారు. సుమారు రెండు కోట్ల జనాభా ఉన్న ఈ జిల్లాకు మంత్రివర్గంలో సరైన ప్రాతినిధ్యం లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. "నాకు మంత్రి పదవి ఇవ్వకపోతే అది నా వ్యక్తిగత నష్టం కాదు, పార్టీకే నష్టం" అంటూ అధిష్టానానికి సూటిగా సందేశం పంపారు. అలాగే రంగారెడ్డి జిల్లా పేరు మారుస్తారనే ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. జిల్లా స్వరూపాన్ని దెబ్బతీయకుండా మరిన్ని మున్సిపాలిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు.



**ఫార్మా సిటీపై పోరు.. కేసీఆర్‌తో విభేదాలు**

గత ప్రభుత్వ హయాంలో ఫార్మా సిటీ ప్రాజెక్టును తాను తీవ్రంగా వ్యతిరేకించానని, ఆ కారణంతోనే మాజీ సీఎం కేసీఆర్ తనను రాజకీయంగా దెబ్బతీశారని మల్‌రెడ్డి ఆరోపించారు. 50 కిలోమీటర్ల పరిధిలో కాలుష్యం చిమ్మే ఫార్మా సిటీ కంటే, పర్యావరణ హితమైన అభివృద్ధి ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం 'ఫ్యూచర్ సిటీ' ఏర్పాటుతో పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకుందని, భూముల ధరలు ఆకాశాన్ని తాకడంతో రైతులు, యజమానులు భూములు విక్రయించడానికి సిద్ధంగా లేరని ఆయన వెల్లడించారు.

మిగతా 2లో..

## కవిత రాజీనామా ఆమోదం

- ముగిసిన కవిత ఎమ్మెల్సీ ప్రస్థానం
- సెప్టెంబర్ లోనే తప్పుకున్నా తాజాగా ఆమోద ముద్ర
- నోటిఫికేషన్ విడుదల చేసిన మండలి కార్యదర్శి
- ఖాళీ అయిన నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం
- రాజీనామా ఆమోదంతో త్వరలో ఉప ఎన్నికకు సిద్ధం కానున్న జిల్లా రాజకీయాలు

02



## అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా

13 కీలక బిల్లులకు ఆమోదం తెలిపిన శాసనసభ
40 గంటలకు పైగా చర్చ.. రెండు కీలక తీర్మానాలకు సభ ఆమోదం



**హైదరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాలు ఐదు రోజుల పాటు అర్థవంతమైన చర్చలతో సాగి నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ సమావేశాల కాలంలో మొత్తం 40 గంటల 45 నిమిషాల పాటు సభ కొనసాగిందని సభాపతి ప్రకటించారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించి అత్యంత కీలకమైన కృష్ణా నదీ జలాల వాటా, మూసీ నది సుందరీకరణ, ఉపాధి హామీ పథకం పేరు మార్పు వంటి అంశాలపై సభ్యులు లోతైన చర్చలు జరిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 13 ముఖ్యమైన బిల్లులకు సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలుపగా, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోరుతూ రెండు కీలక తీర్మానాలను సభ్యులు ఆమోదించారు. నీటి పారుదల శాఖపై ప్రభుత్వం ప్రత్యేకంగా పవర్ పాయింట్ ప్రదర్శన ఇచ్చి,

మిగతా 2లో..

## తెలంగాణ తెచ్చిన మొనగాడు కేసీఆర్
## మూటలు మోసినోడు రేవంత్!



- కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ముఖ్యమంత్రి గుండె ఆగి సస్తాడు
- ఒకే ఒక్క ప్రెస్ మీట్‌కే ప్రభుత్వం ఆగమాగమవుతోంది
- సొంత సిబ్బందిని కొట్టే ముఖ్యమంత్రి.. అసలు నీ సంస్కారం ఏది?
- గోదావరి ఎక్కడుందో తెలియదు.. ప్రాజెక్టుల సోయి లేదు
- తెలంగాణను దగా చేసిన కాంగ్రెస్ ద్రోహులకు బుద్ధి చెబుతాం
- చలిలో రైతులు క్యూ కడుతుంటే ముఖ్యమంత్రి విహారయాత్రలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

02

## మార్చి నాటికి 'భూభారతి' రీలాంచ్

- 7,500 మంది సర్వేయర్ల భర్తీ
- రెవెన్యూ శాఖలో విప్లవాత్మక మార్పులు తెస్తాం
- ప్రపంచంలో ఎక్కడున్నా భూ వివరాలు చూసుకునేలా కొత్త వ్యవస్థ
- సర్వే మ్యాపులు, రికార్డుల పటిష్ఠీకరణే లక్ష్యం: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

02



# తెలంగాణ తెచ్చిన మొనగాడు కేసీఆర్.. మూటలు మోసినోడు రేవంత్!

**జనగామ,స్నేహిత ఎక్స్ ప్రెస్:**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మరోసారి సంచలన విమర్శలు చేశారు. తెలంగాణ సాధించిన కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కసితో ఎదురుచూస్తున్నారని అన్నారు. జనగామ జిల్లాలో ఇటీవల ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుతో ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల అభినందన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... మూటలు మోసుడు తప్ప రేవంత్ రెడ్డి ఏం తెల్వదని విమర్శించారు. కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి నీళ్ల గురించి పాఠాలు చెబుతున్నాడని... అసలు గోదావరి ఎక్కడుందో రేవంత్‌కు తెలియదని అన్నారు. భాక్రానంగల్ ప్రాజెక్టు తెలంగాణలో ఉందని చెబుతున్నాడని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అయిపోయిందని, ప్రజలను సీఎం రేవంత్ రెడ్డి ఎలా మోసం చేశారో ఆలోచించాలని కోరారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితులు ఎలా తయారైందో ఆలోచన చేయాలని, యూరియా కోసం చలిలో ఎదురు చూస్తున్నారని అన్నారు. గ్రామాల్ ప్రజలులో రేవంత్ రెడ్డిని నోటికొచ్చినట్లు తిడుతున్నారని చెప్పుకొచ్చారు. తెలంగాణను 60 సంవత్సరాల పాటు రాచిరంపాన పెట్టిన కాంగ్రెస్ పార్టీ అనే విషయం మర్చిపోయి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడని అన్నారు. 60 సంవత్సరాల కాంగ్రెస్ దుర్మార్గాన్ని, తెలంగాణకు చేసిన ద్రోహాన్ని ఎదురించి, ప్రాణాలకు తెగించి కొట్లాడి కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించారని... అలాంటి వ్యక్తిపై రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నదులపై, తెలంగాణపై రేవంత్ రెడ్డి కనీస అవగాహన లేదని విమర్శించారు. తెలంగాణలో అన్నివర్గాలకు సంక్షేమం అమలు చేయడంతో పాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినందుకు కేసీఆర్‌కు ఉరివేయాలని రేవంత్ రెడ్డి అంటున్నారా? అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో అడ్డగోలుగా హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను రాహుల్ గాంధీ మోసం చేశారని విమర్శించారు. మొదటి సంవత్సరమే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన రాహుల్ గాంధీ మాటలు విని ప్రతి ఒక్క నిరుద్యోగి ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయించారని అన్నారు. చదువుకున్న విద్యార్థులను, నిరుద్యోగులను మోసకారి మాటలతో రెచ్చగొట్టిన రాహుల్ గాంధీని ఉరి తీయాలి అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆడబిడ్డలకు బతుకమ్మ చీర పెట్టే ముఖం లేని, ఆడబిడ్డలకు నెలకు రూ. 2500 ఇవ్వలేని రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తా అంటున్నారని విమర్శించారు. కళ్యాణ లక్ష్మీ కింద హామీ ఇచ్చిన తులం బంగారం అయినా ఆడబిడ్డలకు ఇచ్చారా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఎందుకు అంత పిచ్చిగా మాట్లాడుతున్నాడో ఎవరికీ అర్థం కావడం లేదని అన్నారు.

రేవంత్ రెడ్డి తన సొంత సెక్యూరిటీ సిబ్బందిని కూడా ప్రజల ముందే కొడుతున్నారని అన్నారు. తన చదువు మీద రేవంత్ రెడ్డి ఎందుకు ఏడుస్తున్నాడో అర్థం కావడం లేదని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డిని తల్లిదండ్రులు చదువుకోమని పంపిస్తే లంగా పనులు చేసుకుంటూ చదువుకోలేదని.. దానికి తానేం చేయాలని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "తెలంగాణ తెచ్చిన మొనగాడు కేసీఆర్... కేసీఆర్ ఒక్క ప్రెస్ మీట్‌కే రేవంత్ రెడ్డి ఆగమాగం అవుతున్నాడు. అసెంబ్లీకి వచ్చి మాట్లాడితే అసెంబ్లీలోనే గుండె ఆగి సస్తాడు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధిద్దాం. కారు గుర్తు కనిపిస్తే కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేయాలన్న ఆలోచనతోనే ఓటు వేసి గెలిపించుకుందాం. గెలిచిన ప్రతి ఒక్క సర్పంచ్ మున్సిపల్ ఎన్నికల్లోనూ పార్టీ కోసం పనిచేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని బెదిరింపులు చేసినా, ఒత్తిడులకు గురిచేసినా పార్టీ కోసం నిలబడిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకుడికి ధన్యవాదాలు. కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కసితో ఎదురుచూస్తున్నారు" అని కేటీఆర్ అన్నారు.

# సింగరేణి కార్మికులకు 'కోటి' భరోసా

**( మొదటిపేజీ తరువాయి )**

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమగ్ర సమాధానం ఇచ్చారు. సింగరేణి తెలంగాణకు గర్వకారణమైన అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా, వేలాది కుటుంబాలకు ప్రత్యక్షపరోక్ష ఉపాధి కల్పిస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలిచిందని భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణి ఆసుపత్రుల్లో మార్చి నాటికి వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తామని తెలిపారు. 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్ ల్యాబ్ ప్రారంభిస్తామని చెప్పారు. 32 మంది వైద్యుల కోసం నోటిఫికేషన్ ఇచ్చామని... త్వరలో భర్తీ చేస్తామని తెలిపారు. 176 మంది పారా మెడికల్ సిబ్బంది నియామక ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. రామగుండంలో క్యాత్ ల్యాబ్ నిర్మాణం పీపీపీ మోడల్ లో చేపడుతున్నామని తెలిపారు.



**ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది..**

ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు సింగరేణి ఆసుపత్రుల్లో మందుల సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. సీపీఆర్ఎంఎస్ పథకం అందుబాటులో ఉందని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు 8 లక్షల వరకు మందులను తీసుకునే అవకాశం కూడా కల్పించామని చెప్పారు. టెర్మినల్ బెనిఫిట్స్ కూడా అందిస్తున్నామని... సింగరేణి పరిధిలోని ఖాళీ స్థలాల్లో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు ఇండ్ల నిర్మాణం కొరకు స్థల కేటాయింపు అంశాన్ని బోర్డులు మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గతంలో బొగ్గు తవ్వకం పూర్తిగా ప్రభుత్వ రంగంలో ఉండి సింగరేణికి మోనోపాలీ ఉండేదని... కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను వేలం ద్వారా ప్రైవేట్ సంస్థలకు కేటాయిస్తుండటంతో సింగరేణి ప్రైవేట్ రంగంతో నేరుగా పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. థర్మల్ పవర్ స్టేషన్‌లు తక్కువ ధరకు బొగ్గు సరఫరా చేసే సంస్థల నుంచే కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో... సింగరేణి తన ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటూ నాణ్యతను పెంచుకుని పోటీని ఎదుర్కోవాలని చెప్పారు. సింగరేణి సంస్థ భవిష్యత్తు మరియు కార్మికులువారి కుటుంబాల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క తెలిపారు.

**సమగ్ర ఇన్సూరెన్స్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాం..**

త్వరలోనే సింగరేణి ప్రాంత శాసనసభ్యులు, సంబంధిత మంత్రులు, సింగరేణి ఉన్నతాధికారులతో కలిసి సమగ్ర చర్చలు జరిపి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. సింగరేణిని బలోపేతం చేయడం, కార్మికుల ఉపాధి భద్రతను కాపాడటం, సంస్థను భవిష్యత్ పోటీకి తగినట్లు తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా సింగరేణి ఉద్యోగులకు సమగ్ర ఇన్సూరెన్స్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం లేదా సింగరేణి సంస్థపై, కార్మికులపై కానీ ఒక్క రూపాయి భారం లేకుండా పూర్తిగా బ్యాంకుల సహకారంతో అమలు చేస్తున్నామని చెప్పారు. ఉద్యోగుల జీతం బ్యాంకు ఖాతాల ద్వారానే వస్తున్న నేపథ్యంలో అదే బ్యాంకింగ్ వ్యవస్థను ఉపయోగించి ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. కార్మికులు,ఉద్యోగులు ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబానికి రూ. ఒక కోటి ప్రమాద బీమా అందేలా రూపొందించామని తెలిపారు. ఈ ఒక కోటి రూపాయల ఇన్సూరెన్స్ పథకాన్ని సింగరేణితో పాటు విద్యుత్ శాఖ డిస్కమ్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులకు,కార్మికులకూ వర్తింపజేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికీ కోటి బీమా సౌకర్యం అందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.

# ఎరువుల కొరత లేదు.. రైతులకు ఆందోళన వద్దు!

**హైదరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**



కేంద్ర ప్రభుత్వం దిగుమతి చేసుకున్న యూరియా సరఫరాలో జరిగిన జాప్యం, పంటకాలం సమయంలో రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ మూతపడటంతో గత ఖరీఫ్ సీజన్‌లో కొంత ఇబ్బంది ఏర్పడినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. అయిన కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ, అవసరమైన ఒత్తిడి తీసుకువచ్చి రాష్ట్రానికి 9.79 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయగలిగామని చెప్పారు. 202425 ఖరీఫ్‌తో పోల్చితే 13 వేల మెట్రిక్ టన్నులు అధికమని వెల్లడించారు. మంగళవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సమయంలో సభ్యులు మదన్ మోహన్ రావు, పాల్వాయి హరీష్ బాబు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. 201819 నుంచి 202324 వరకు యూరియా అమ్మకాల గణాంకాలను పరిశీలిస్తే, రబీ సీజన్‌లో ఏ సంవత్సరంలోనూ డిసెంబర్ 31 నాటికి 3 లక్షల మెట్రిక్ టన్నులకు మించి అమ్మకాలు జరగలేదని, ఈ రబీ సీజన్‌లో డిసెంబర్ 31 నాటికి 3.93 లక్షల మెట్రిక్ టన్నులు, నేటి వరకు మొత్తం 4.52 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిగినట్లు తెలిపారు.

**నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి..**

ప్రస్తుతం రాష్ట్రంలో ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ప్రస్తుతం యూరియా 1,67,884 మెట్రిక్ టన్నులు, డీ.ఏ.పీ 51,458 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 2,67,661 మెట్రిక్ టన్నులు, ఎస్.ఎస్.పీ 22,367 మెట్రిక్ టన్నులు, ఇతర ఎరువులు 30,880 మెట్రిక్ టన్నులు నిల్వల్లో ఉన్నాయన్నారు. రైతులకు అవసరమైనంత ఎరువులు ఎక్కడా కొరత లేకుండా అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎరువుల సరఫరాలో పారదర్శకత తీసుకురావడానికి ఫెర్టిలైజర్ యాప్ ను ప్రయోగాత్మకంగా ఐదు జిల్లాల్లో అమలు చేస్తున్నామని, ఇప్పటివరకు ఈ యాప్ ద్వారా 1.59 లక్షల మంది రైతులు 4.55 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. యాప్ అమలులో ఉన్న జిల్లాల రైతులు, డీలర్లు యాప్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

**ఎలాంటి ఆందోళన అవసరం లేదు..**

యాప్ విజయవంతం కాగానే అన్ని జిల్లాలలో యాప్ అమలులోనికి తీసుకువస్తామని యాప్ ద్వారా రైతుల అవసరం మేరకు యూరియాను, వారికి సౌకర్యవంతమైన సమయంలో కొనుగోలు చేసే విధంగా చేస్తున్నామన్నారు. కొన్ని ప్రచార సాధనాలు , రాజకీయ పార్టీలు వీటి మీద కూడా అసత్య ప్రచారాలు, ఆరోపణలు చేస్తున్నారు. ఎక్కడో రెండు, మూడు చోట్ల రైతు ఆదుర్దా పడిన సంఘటనలను చూపెట్టి, రాష్ట్రంలో యూరియా కొరత ఉందని అనడం వారి అవివేకమని పేర్కొన్నారు. డాష్ బోర్డు నిర్వహించి జిల్లాలు, మండలాలు మరియు డీలర్ల వారిగా స్టాక్ వివరాలను కలెక్టర్లకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ డాష్ బోర్డు సదుపాయాన్ని త్వరలోనే ఎమ్మెల్యేలకు కూడా కల్పిస్తామన్నారు. రైతులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదని, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ రాష్ట్రానికి కావాల్సినంత యూరియా కేటాయింపులు తీసుకురావడంలో ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# కవిత రాజీనామా ఆమోదం

- **ముగిసిన కవిత ఎమ్మెల్సీ ప్రస్థానం**
- **సెప్టెంబర్ లోనే తప్పుకున్నా తాజాగా ఆమోద ముద్ర**
- **నోటిఫికేషన్ విడుదల చేసిన మండలి కార్యదర్శి**
- **ఖాళీ అయిన నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం**
- **రాజీనామా ఆమోదంతో త్వరలో ఉప ఎన్నికకు సిద్ధం కానున్న జిల్లా రాజకీయాలు**



**హైదరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి కుమార్తె, నిజామాబాద్ స్థానిక సంస్థల ప్రతినిధి కల్వకుంట్ల కవిత శాసన మండలి సభ్యత్వానికి చేసిన రాజీనామాకు అధికారికంగా ఆమోద ముద్ర పడింది. సోమవారం ఉదయం ఆమె శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని తన నివాసంలో కలిసి, తన రాజీనామాను తక్షణమే ఆమోదించాలని కోరారు. ఈ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఛైర్మన్, రాజీనామాను ఆమోదిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించి లెజిస్లేటివ్ సెక్రటరీ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేయడంతో ఆమె సభ్యత్వం రద్దయినట్లు ఖరారైంది.


**త్వరలోనే ఉప ఎన్నిక..**

గతేడాది సెప్టెంబర్ 3వ తేదీన కవిత తన ఎమ్మెల్సీ పదవికి, బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే సాంకేతిక కారణాల వల్ల అప్పట్లో ఆ రాజీనామా ఆమోదం పొందలేదు. తాజాగా ఆమె స్వయంగా మండలి ఛైర్మన్‌ను కలిసి విన్నవించడంతో ఈ ప్రక్రియ వేగవంతమైంది. కవిత రాజీనామాతో నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానం ఇప్పుడు అధికారికంగా ఖాళీ అయింది. దీనిపై మండలి సచివాలయం భారత ఎన్నికల సంఘానికి సమాచారం పంపనుంది. త్వరలోనే ఈ స్థానానికి ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉంది.

**స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా..**

కల్వకుంట్ల కవిత 2021లో నిజామాబాద్ స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా భారీ మెజారిటీతో విజయం సాధించారు. అంతకుముందు నిజామాబాద్ లోక్‌సభ సభ్యురాలిగా పనిచేసిన ఆమె, తెలంగాణ జాగృతి ద్వారా రాష్ట్ర సాధన ఉద్యమంలో బతుకమ్మ పండుగను ప్రపంచవ్యాప్తం చేసి గుర్తింపు పొందారు. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కీలక పాత్ర పోషించిన ఆమె, ప్రస్తుత రాజకీయ సమీకరణాల నేపథ్యంలో పదవికి తప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఆమె రాజీనామా ఆమోదం పొందిన నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లో కొత్త ఉత్కంఠ నెలకొంది. తదుపరి ఆమె రాజకీయ అడుగులు ఏ దిశగా ఉంటాయనే దానిపై సర్వత్రా ఆసక్తి వ్యక్తమవుతోంది.

# మార్చి నాటికి 'భూభారతి' రీలాంచ్



**హైదరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రెవెన్యూ శాఖలో సంస్కరణలను ప్రవేశ పెట్టి, పక్కాగా అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్‌ప్రజా ప్రభుత్వానిదేనని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం (ట్రెసా) రాష్ట్ర అధ్యక్షుడు వంగా రవీందర్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లో సురవరం ప్రతాప్ రెడ్డి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 'ట్రెసా' డైరీ ఆవిష్కరణ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరై డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే మార్చినాటికి 'భూభారతి' యాప్‌లో సర్వేకు సంబంధించిన అంశాలను పటిష్టపరిచి పునరుద్ధరిస్తామని తెలిపారు. 7,500 మంది వరకు లైసెన్స్‌డ్, ప్రభుత్వ సర్వేయర్లను కూడా నియమిస్తామని ప్రకటించారు.

**ప్రపంచంలో ఏమూలన ఉన్నా..**

రెవెన్యూ భూరికార్డులతో పాటు సర్వే మ్యాప్స్, వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలన్ని ప్రపంచంలో ఏమూలన ఉన్నా.. చూసుకునే విధంగా ఒకే వేదికపైకి తీసుకొస్తామని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు సానుకులంగా పరిష్కరించేందుకు త్వరలో ట్రెసా సంఘం నాయకులతో భేటీ అవుతానని, ప్రభుత్వ ఆర్థిక వెసలుబాటు చూసుకొని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించాలని, 61 ఏండ్లు పైబడిన వీఆర్ఏల వారసులకు కారుణ్య నియామకాలు, ఇతర నియోజకవర్గాలకు కేటాయించిన జీపీవోలను సొంత నియోజకవర్గాలకు బదిలీ చేయాలని మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ కుమార్ మాట్లాడుతూ జీపీవో వ్యవస్థ వలన గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థ పటిష్టంగా ఉందని, ఆ మనోబలంతో ధైర్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఈజాక్‌ఛైర్మన్ మారం జగదీశ్వర్, టీఈజాక్‌సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు, ట్రెసా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పడిగెల రాజ్‌కుమార్, కల్చరల్ డైరక్టర్ ఏనుగు నర్సింహా రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కె.చంద్రకళ, అసోసియేట్ ప్రెసిడెంట్ ఉపేందర్ రెడ్డి, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్, టీజీవో ప్రధాన కార్యదర్శి శ్యాం, ట్రెసా రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు, నిరంజన్, చక్రవర్తి, శాస్త్రి, వాణిరెడ్డి, వాణి, నాగమణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా

**( మొదటిపేజీ తరువాయి )**

ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వం చేసిన పొరపాట్లను సాక్ష్యాలతో సహా ఎండగట్టింది. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే పరమావధిగా ఈ సమావేశాలు సాగాయని సభాపతి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృష్ణా జలాల వివాదంపై సభలో సుదీర్ఘంగా ప్రసంగిస్తూ ప్రాజెక్టుల నిర్వహణను బోర్డుకు అప్పగించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. గత పాలకుల నిర్ణయాల వల్ల తెలంగాణకు జరిగిన నష్టాన్ని గణాంకాలతో వివరించిన ముఖ్యమంత్రి, రాష్ట్ర వాటాగా దక్కాల్సిన నీటి విషయంలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. సభలో మొత్తం 66 మంది సభ్యులు వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగా, గరిష్ట సమయం ప్రజా సమస్యల చర్చకే కేటాయించినట్లు అధికారులు తెలిపారు. సభలో తమకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని, ప్రతిపక్ష గళాన్ని నొక్కివేస్తున్నారని ఆరోపిస్తూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సమావేశాలను బహిష్కరించింది. అయినప్పటికీ ప్రభుత్వం నాలుగు స్వల్పకాలిక చర్చల ద్వారా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో తాము చేపట్టిన సంస్కరణలను వివరించింది. ఐదు రోజుల పాటు వాడీవేడిగా, అర్థవంతంగా సాగిన ఈ సమావేశాలు ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా నిలిచాయని సభాపతి ధన్యవాదాలు తెలుపుతూ సభను వాయిదా వేశారు.

# అసెంబ్లీలో 'హీల్ట్' సెగ!

**( మొదటిపేజీ తరువాయి )**

వేల కోట్ల రూపాయల 'మతలబు' ఉందని ఆరోపించారు. బడా పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చేందుకే ఈ పాలసీ తెచ్చారని, ఆ భూములు ప్రభుత్వానివేనని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. పారిశ్రామిక భూముల కన్వర్షన్ వల్ల కేవలం ధనవంతులే బాగుపడతారని, సామాన్య కార్మికుల ఉపాధి మాటేమిటని ప్రశ్నించారు. ఈ పారిశ్రామిక భూములపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, పారదర్శకత లేకపోతే కుంభకోణాలకు తావిచ్చినట్లవుతుందని ప్రతిపక్షాలు ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి.



**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం..**

ప్రతిపక్షాల విమర్శలకు మంత్రి శ్రీధర్ బాబు దీటుగా బదులిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే పారిశ్రామిక భూములకు 'ఫ్రీ హోల్డ్' హక్కులు ఇచ్చే జీవోలు (MS 19, 20, 21) వచ్చాయని, ఇప్పుడు తాము కేవలం ఇంపాక్ట్ ఫీజు వసూలు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు పూనుకున్నామని తెలిపారు. "మేము ఎవరికీ భూములను అమ్మడం లేదు.. కేవలం వినియోగం మార్చుకునే ఆప్షన్ మాత్రమే ఇస్తున్నాం. దీనివల్ల వచ్చే 4 వేల నుండి 5 వేల కోట్ల ఆదాయాన్ని కూడా రాష్ట్ర అభివృద్ధికి, పర్యావరణ రక్షణకే ఉపయోగిస్తాం" అని క్లారిటీ ఇచ్చారు. చైనాలోని 'బ్లూ స్కై' పాలసీ, ఢిల్లీలో సుప్రీం కోర్టు ఆదేశాలను ఉదాహరణగా చూపుతూ.. అభివృద్ధి పక్కనే వినాశనం ఉండకూడదన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని ఉద్ఘాటించారు. రాజకీయాలను పక్కన పెట్టి భావి తరాల ఆరోగ్యం కోసం అందరూ సహకరించాలని కోరడంతో ఈ కీలక చర్చ ముగిసింది.

# జాప్యం లేకుండా సిఎంపిఎఫ్ సేవలు: కమిషనర్ డా:కే గోవర్ధన్



**రామగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

జాప్యం లేకుండా కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సేవలను ఉద్యోగులకు అందించేందుకు కృషి చేస్తున్నామని సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ డా:కె.గోవర్ధన్ అన్నారు. మంగళవారం జి.ఎం కార్యాలయం నందు సంబంధిత అధికారులు, ఉద్యోగులతో "ప్రయాస్" ఐదవ షెడ్యూల్ లో భాగంగా సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ముందుగా కమిషనర్ ఎన్ సి డబ్యు ఎ ఉద్యోగుల రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ 241 పిపిఓ ఆర్డర్స్ ను రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు కు అందజేశారు. ఈ సందర్భంగా సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ డా: గోవర్ధన్ మాట్లాడుతూ సిఎంపిఎఫ్ లావాదేవీలు అన్ని సికేర్స్ (CCARES) పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఉద్యోగులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా సిఎంపిఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని తెలిపారు. పెండింగ్ లోఉన్న సిఎంపిఎఫ్ క్లెయిమ్స్, రివైజ్డ్ పెన్షన్ తదితర అంశాలపై చర్చించారు, ఉద్యోగుల సందేహాలకు సమాధానం ఇచ్చారు. పెన్షన్ సీఎంపిఎఫ్ దరఖాస్తులు పెండింగ్ ఉండకుండా చర్యలు చేపట్టామన్నారు. జీరో పెండింగ్ స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలనీ చెప్పారు. రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సీఎంపిఎఫ్ వివరాలను చూసే సిబ్బంది సీఎంపిఎఫ్ అధికారులతో సమన్వయం తో పని చేయాలని, ఉద్యోగుల ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లేకుండా చూడాలని అందుకు తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డివై పియం వి.సునీల్ ప్రసాద్, సీనియర్ పిఓ పి.రాజేశం, ఫైనాన్స్ అధికారి భరత్, సిఎంపిఎఫ్ సిబ్బంది కామేశ్వర రావు, లలిత, అనిత, మనోహర్, ప్రదీప్ రెడ్డి తో పాటు వివిధ గనుల సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పల్లె ప్రకృతి వనంలో ఇళ్ళు నిర్మాణంకు భూమి పూజ

- ప్రభుత్వ స్థలమే అని తేల్చిన రెవిన్యూ,అధికారులు
- మరి ఇప్పుడెలా నిర్మాణం చేపడతారు అంటున్న అధికారులు
- గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనం కార్యక్రమం
- నేడు తుంగలో తొక్కిన ఎస్సీ,ఎస్టీ కమిషన్
- దారిలోనే ఇల్లు నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎస్సీ,ఎస్టీ ఛైర్మెన్



**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని కోహీర్ మండలం సజ్జపూర్ గ్రామంలో ఓ ఇంటి నిర్మాణంలో తీవ్ర గందరగోళం నెలకున్న విషయం తెలిసిందే.. గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో గ్రామానికి చెందిన రాము ఇల్లు నిర్మాణం చేపట్టారు.అది ప్రభుత్వ స్థలంకు సంబందించిన పల్లె ప్రకృతి వనంకు చెందినదని రెవిన్యూ అధికారులు,గ్రామ కార్యదర్శి నోటీసులు జారీ చేసి 3రోజుల తర్వాత అక్రమ నిర్మాణమని తేల్చి కూల్చేయడం జరిగింది. అనంతరం వాస్తవాలు తెలుసుకోవడానికి రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులకు పర్యటించి సమావేశం నిర్వహించి ఎస్సీలపైన దాడులు సరైనవి కాదని ఎస్సీలకు అన్యాయం జరిగితే సహించేది లేదని హేచ్చరించి భాద్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.గత కొన్నిరోజుల తర్వాత మంగళవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు పర్యటించి బాధిత కుటుంబానికి రూ.25 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసి అక్కడే నిర్మాణం చేపట్టిన ఇల్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో పల్లె ప్రకృతి వనాల కార్యక్రమాన్ని ప్రతిష్టత్మకంగా చేపట్టిన విషయం తెలిసిందేనని కాని మరి ఆ విషయం గమనించకుండ పల్లె ప్రకృతి వనంకు వెళ్లే దారిలో ఉన్న నిర్మాణంకు భూమి పూజ చేశారు ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు గ్రామాలను పచ్చదనంతో అభివృద్ధి చేయాలన్న అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ కళలను తుంగలో తొక్కరని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బాధితులకు న్యాయం చేయాలంటే గ్రామ కంఠంలోని భూమిలో ఇల్లు స్థలం ఇప్పించి ఇల్లు నిర్మాణం చేపట్టి ఎస్సీ కులానికి చెందిన రాము కుటుంబానికి న్యాయం చేసి, గ్రామంలోని పల్లె ప్రకృతి వనం స్థలం కాపాడాలని గ్రామస్తులు అంటున్నారు.

## వైద్యాధికారిపై లైంగిక వేధింపుల కేసు నమోదు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలో బీర్కూర్ పీహెచ్సీ వైద్యాధికారిపై కేసు నమోదైంది.ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే..బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లైంగిక వేధింపులు జరుగుతున్నాయంటూ ఓ ఫార్మాసిస్ట్ వైద్యాధికారి లింగాల నాగ గిరీష్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఫిర్యాదు మేరకు కేసు..బాధితురాలి ఫిర్యాదు మేరకు బీర్కూర్ పోలీసులు కేసు నమోదు చేసి,వైద్యాధికారి లింగాల నాగ గిరీష్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఇన్చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో రోహిత్ కుమార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని వైద్య సిబ్బందితో కేసు వివరాలపై విచారణ జరిపారు.ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నాగిరెడ్డిపేట మండలం తహశీల్దార్ యార్లగడ్డ శ్రీనివాస్ రావు ఏసీబీకి చిక్కారు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం తహశీల్దార్ యార్లగడ్డ శ్రీనివాస్ రావు ఏసీబీకి చిక్కారు.ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్గా పట్టుబడ్డాడు.ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని ఓ వ్యక్తి వ్యవసాయ భూమిని తన పేరున బదిలీ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నాడు. కాగా..బదిలీ చేయాలంటే డబ్బులు ఇవ్వాలని తహశీ ల్దార్ డిమాండ్ చేశాడు.దీంతో బాధితుడి ఏసీబీని ఆశ్రయించాడు.మంగళవారం రూ.50 వేల లంచం డబ్బులు అజయ్ అనే ప్రైవేటు వ్యక్తి తీసుకుంటుండగా అనిశా అధికారులు రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు.అనంతరం తహశీల్దార్ శ్రీనివాస్ రావు, ప్రైవేటు వ్యక్తి అజయ్లను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారిని హైదరాబాద్లోని ఏసీబీ కోర్టుకు తరలించారు.

**లంచం అడిగితే ఫిర్యాదు చేయండి**

ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు సూచిస్తున్నారు. ఫిర్యాదు చేయడానికి ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలని పేర్కొన్నారు.అలాగే ఏసీబీ తెలంగాణ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు whatsapp (9440446106), facebook (Telangana ACB), X/గతంలో ట్విట్టర్ (@ Telangana ACB) ద్వారా కూడా సంప్రదించవచ్చన్నారు.

## రూ.10 లక్షల ఎన్.ఆర్.జి.ఎస్ నిధులతో సిసి పనులకు శంకుస్థాపన



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో పిట్లం గ్రామంలోని ఈద్గా మైదానం వద్ద మైనారిటీ సోదరుల సౌకర్యార్థం రూ.10 లక్షల ఎన్.ఆర్.జి.ఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను పిట్లం గ్రామ సర్పంచ్ కుమ్మరి శేఖర్ ఈరోజు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..ఈద్గా వద్ద ప్రార్థనలకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు.చేపట్టిన పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆవైజ్ బేగ్,యాదూల్,ఏఎంసీ డైరెక్టర్ నజీర్,హమీద్,మెయిన్,ఇమ్రోజ్ తదితర ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## బస్సులు సర్వీస్ రోడ్డు వెంబడి రావాలని గ్రామస్తులు ధర్నా

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అల్లాదుర్గం మండలం రాంపూర్ బస్సు స్టేజి వద్ద రాంపూర్ సీతా నగర్ గ్రామ ప్రజలు మంగళవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులు సర్వీస్ రోడ్డు వెంబడి రాకుండా హైవేపై నుండి వెళ్లిపోవడంతో ప్రయాణికులకు చాలా ఇబ్బందిగా ఉందని గంటపాటు రోడ్డుపై ధర్నా చేశారు. రోడ్డుపై వాహనాలు ఆగిపోవడంతో సమాచారం అందుకున్న అల్లాదుర్గం ఎస్ఐ శంకర్,తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని బయట ఇచ్చిన ప్రజలతో ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ఇప్పటినుండి సర్వీస్ రోడ్డు వెంబడి ఆర్టీసీ బస్సులు వచ్చేటట్లు చూస్తామని ఆర్టీసీ అధికారులు చెప్పడంతో ఆందోళన చేస్తున్న ప్రజలకు ఎస్సై సర్ది చెప్పారు. ఇప్పటి నుండి సర్వీసు రోడ్డు వెంబడి ఆర్టీ బస్సులు రాకుంటే పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని రెండు గ్రామాల ప్రజలు ఆర్టీసీ అధికారులకు హెచ్చరించారు.




## యూరియా బ్లాక్ మార్కెట్ దందాలకు చెక్ పెట్టాలి

### ఎమ్మెల్యే మదన్ మోహన్




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ యూరియా కొరత సమస్యపై కీలకంగా మాట్లాడారు.యూరియా బ్లాక్ మార్కెట్ దందాలకు చెక్ పెట్టే విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన సభ వేదికగా కోరారు.ఖరీఫ్ సీజన్ సమయంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ రైతులు యూరియా కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. యూరియా కొరతకు ప్రధాన కారణం బ్లాక్ మార్కెట్ దందాలే అని రైతులు తనకు తెలిపారని ఎమ్మెల్యే మదన్ మోహన్ సభలో వెల్లడించారు. యూరియా కొరతను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్ రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ యాప్ ద్వారా యూరియా లభ్యత వివరాలు రైతులకు ముందుగానే తెలియడంతో అనవసర భయాలు తొలగుతాయని అన్నారు.ఈ విషయంలో ఎల్లారెడ్డి రైతుల తరపున ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు.రైతులు భయంతో సంవత్సరానికి సరిపడే యూరియాను ఒక్కసారిగా కొనుగోలు చేయడం కూడా కొరతకు ఒక కారణమని ఎమ్మెల్యే తెలిపారు.యాప్‌లో యూరియా లభ్యత స్పష్టంగా చూపితే రైతుల ఆందోళన తగ్గుతుందని చెప్పారు.రైతులు నాటిన పంట వివరాలు,పంట సాగు చేసిన ప్రాంత వివరాలను యాప్‌లో నమోదు చేస్తే,ఆ సమాచారం ఆధారంగా అవసరమైన మేరకు యూరియా పంపిణీ చేయడం సులభమవుతుందని అన్నారు.యాప్‌లో డాష్‌బోర్డ్ సిస్టమ్, యూరియా ట్రాకింగ్ సిస్టమ్,ఆధార్‌తో లింక్ చేసిన ఈటోకెన్ సిస్టమ్ ఉండాలని సూచించారు. ప్రతి యూరియా బస్తాపై QR కోడ్ ఏర్పాటు చేస్తే బ్లాక్ మార్కెట్ దందాలకు పూర్తిగా చెక్ పెట్టవచ్చని తెలిపారు.అలాగే యూరియా లభ్యత డాష్‌బోర్డ్‌కు ఎమ్మెల్యేలకు కూడా అందుబాటులో ఉంచాలని కోరారు ప్రభుత్వం రైతులకు వాతావరణ సూచనలు కూడా అందిస్తే సాగుకు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు.ఈ అంశంపై స్పందించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల ఎమ్మెల్యే మదన్ మోహన్, సూచించిన విషయాలను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు.రబీ సీజన్‌లో రైతులకు ఎలాంటి యూరియా కొరత లేదని ,ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు రైతులు ఎంత యూరియా అడిగితే అంతా ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినట్టు మంత్రి సభకు తెలిపారు.

## సమాచార హక్కు చట్టం సాధన కమిటీ నియామకం

### రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మోమిన్‌పేట్ వాసి సోమారపు రవి ఏకగ్రీవ ఎన్నిక

**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**



వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ గ్రామానికి చెందిన సోమారపు రవి, సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) సాధన కమిటీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ ఎన్నికను ఆర్టీఐ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.చంటి ముదిరాజ్,జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి అధికారికంగా ప్రకటించారు.ప్రజల హక్కుల పరిరక్షణ, పారదర్శక పాలన సాధనలో నిరంతరం కృషి చేస్తున్న సోమారపు రవి సేవలను గుర్తించిన జాతీయ,రాష్ట్ర నాయకత్వం ఈ బాధ్యతను ఆయనకు అప్పగించడం విశేషం.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆర్టీఐ చట్టం ద్వారా సామాన్య ప్రజలకు న్యాయం చేకూర్చడంలో రవి పాత్ర మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన అనంతరం సోమారపు రవి మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి ఈ కీలక బాధ్యత అప్పగించిన జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.చంటి ముదిరాజ్,జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతికు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఆర్టీఐ చట్టం అనేది ప్రజల చేతిలో ఉన్న అత్యంత శక్తివంతమైన ఆయుధమని,దీని ద్వారా అవినీతి నిర్మూలన, పారదర్శక పాలన సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీఐ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ..గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు, హక్కులపై స్పష్టత కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని రవి తెలిపారు. మోమిన్‌పేట్ గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి నాయకత్వానికి ఎదగడం జిల్లా ప్రజలకు గర్వకారణమని స్థానికులు అభినందనలు తెలియజేశారు.

## తాసిల్దార్ కార్యాలయం ఎదుట అర్ధనగ్నంగా హల్ చల్..




- విరాసత్ చేస్తారా చేయరా
- ఎమ్మార్వో వెంకటేశ్వర్లు సత్యంను అర్థం అయ్యేలా నచ్చ చెప్పడంతో అక్కడినుంచి వెళ్ళిపోయాడు

**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

వికారాబాద్ జిల్లా చౌడాపూర్ కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట సత్యం అనే ఒ వ్యక్తి హల్చల్ చేశాడు. తన తండ్రి అన్మయ్య నుండి వస్తున్న భూమి ను విరాసత్ కు అప్లై చేసుకున్న సత్యం.. విరాసత్ ఫైల్ ను ముందుకు పంపించడం లేదంటూ అర్ధనగ్నంగా తాసిల్దార్ కార్యాలయం ముందు హంగామా చేశాడు.మండల తాసిల్దార్,ఇ భూమి వివాదంలో ఉన్నందున విరాసత్ చేయడం సాధ్యం కాదని సత్యం కు ఎంత చెప్పినా కూడా వినకుండా హంగామా చేశాడు.సత్యం తండ్రి హనుమయ్యకు ముగ్గురు భార్యలు ఉన్నందున ఈ భూమి విరాసత్ చేయడం నేపథ్యంలో ఇ భూమి కుటుంబ వివాదంలో ఉంది.తండ్రి చనిపోయిన తర్వాత రెండో భార్య ఈశ్వరమ్మ కొడుకు సత్యంను మరో సరి అర్థమయ్యేలా ఎమ్మార్వో వెంకటేశ్వర్లు నచ్చచెప్పడంతో సత్యం అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

## లంబాడి విద్యార్థి సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా కాట్రవత్ రమేష్ నాయక్ నియామకం



**హైదరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** శంషాబాద్ మండలంలోని ఎర్ర కుంట తండాకు చెందిన కాట్రావత్ రమేష్ నాయక్ ను లంబాడి విద్యార్థి సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా రాష్ట్ర అధ్యక్షులు ధరవత్ బాలు నాయక్ నియమించారు.ఈ సందర్భంగా కాట్రవత్ రమేశ్ నాయక్ మాట్లాడుతూ నిరంతరం గిరిజన జాతి విద్యార్థి సమస్యలపై పోరాడుతనని తెలిపారు.నా బాధ్యతను అప్పగించిన బాలు నాయక్ కు కొర్ర రవి నాయక్ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భూక్యా రమేష్ నాయక్, అఖిల్ నాయక్,శ్రీను నాయక్,అనిల్ నాయక్,భరత్ నాయక్,మంగీలాల్ నాయక్,జగన్ నాయక్,లంబాడి విద్యార్థి సేన జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జైపాల్ నాయక్‌ను అభినందించిన ఎస్సి, ఎస్టీ కమిషన్ ఛైర్మన్



**సంగారెడ్డి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లా పర్యటనకు వచ్చిన తెలంగాణా రాష్ట్ర ఎస్సి,ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్యను మరియు ఎస్సి,ఎస్టీ కమిషన్ మెంబర్ రాంబాబు నాయక్, ను మర్యాదపూర్వకంగా కలిసిన గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్ నాయక్.. ఈ సందర్భంగా ఛైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ..బొమ్మారెడ్డి గూడెం సర్పంచ్ గా భారి మెజారిటీతో గెలిచిన ఉద్యమకారుడు ,గిరిజన నాయకుడు జైపాల్ నాయక్ ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం శాలువతో సన్మానం చేసిన ఎస్సి,ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య , కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్..ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ బాబులాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కేసారం గ్రామానికి వెలుగుల పండుగ...!

### నూతన సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య చేతుల మీదుగా ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు



**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కేసారం గ్రామంలో అభివృద్ధి పనులకు నూతన దిశ చూపిస్తూ..నూతన సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య ఆధ్వర్యంలో గ్రామమంతా కొత్తగా ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేశారు.రాత్రివేళల్లో గ్రామానికి మరింత వెలుగు, భద్రత కల్పించేలా చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామ ప్రజల నుంచి ప్రశంసలు పొందుతోంది.ఈ సందర్భంగా గుజ్జరి కిష్టయ్య మాట్లాడుతూ..గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని,ప్రజల భద్రత, సౌకర్యాల కోసం ఆధునిక సదుపాయాలను క్రమంగా అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు వల్ల విద్యుత్ ఆదా జరగడంతో పాటు, గ్రామంలో రాత్రి వేళల్లో ప్రమాదాలు,అసాంఘిక కార్యకలాపాలు తగ్గుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రవి,గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.గ్రామ అభివృద్ధి దిశగా తీసుకున్న ఈ ముందడుగుకు గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## టీయూటీఎఫ్ మండల నూతన క్యాలెండర్ ఆవిష్కరణ




**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) మోమిన్ పేట్ మండల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్ -2026ను మంగళవారం రోజు మధ్యాహ్నం మోమిన్‌పేట్ మండల ఎంపీడీవో సృజన సాహిత్య,ఎస్ఐ అరవింద్ మరియు మండల విద్యాధికారి ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు సుభాష్, బుచ్చయ్య,జైపాల్‌తో పాటు సీఆర్పీలు బుచ్చయ్య,శ్రీనివాస్, పద్మారావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ..ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతోభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టియుటిఎఫ్ మోమిన్‌పేట్ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్,ప్రధాన కార్యదర్శి నీలాంబిక,జిల్లా బాధ్యులు కిషోర్,శ్రీనివాస్,అలాగే మండల బాధ్యులు శమంత,సువర్ణ,అనిత,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## దొంగ ఓట్లను తొలగించాలని సబ్ కలెక్టర్ ఆఫీస్ ఎదుట బీజేపీ ధర్నా





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కామారెడ్డి జిల్లా బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో దొంగ ఓట్లను తొలగించాలని మండల బీజేపీ శాఖ డిమాండ్ చేసింది.ఈ మేరకు మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నాచేశారు.ఓట్లు వార్డులు దాటిపోయాయి.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కోణాల గంగారెడ్డి మాట్లాడుతూ..బాన్సువాడ పట్టణంలోని 9వ వార్డులోని ఓట్లను ఒకటో వార్డులోకి వెళ్లాయన్నారు.అలాగే ఆరో వార్డులో ఏకంగా 400 ఓట్లు పెరిగాయన్నారు. ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు అధికారులు ఇలా ఓట్లను తారుమారు చేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నడపాల్సి ఉన్నప్పటికీ అధికారులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు బాన్సువాడ మున్సిపాలిటీ ఓటర్ల జాబితాలో జరుగుతున్న అవకతవకలపై ఎన్నికల అధికారులు సమగ్ర సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు.అనంతరమే మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చీదర సాయిలు, నాయకులు శంకర్ గౌడ్,చిరంజీవి, ఉమేష్,శ్రీనివాస్,లక్ష్మీనారాయణ డాకయ్య,మహేష్,రామకృష్ణ,అనిల్, శివశంకర్,శ్రీకాంత్,రాజాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ఫుడ్ పాయిజన్.. పలువురు విద్యార్థులకు అస్వస్థత



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు.ఈ ఘటన నాగిరెడ్డి పేట మండల మాల్తుమ్మెద ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం ఎనిమిది మంది విద్యార్థులు వాంతులు చేసుకున్నారు.

**చికిత్స నిమిత్తం ఆస్పత్రికి..**

భోజనం చేశాక తీవ్రంగా వాంతులు చేసుకోవడంతో స్పందించిన ఉపాధ్యాయులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం హుటాహుటిన ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో ప్రస్తుతం విద్యార్థులకు వైద్యం అందిస్తున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను ఆర్డీవో పార్థసింహారెడ్డి పరామర్శించారు.ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

# బాన్సువాడ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ






**కామారెడ్డి జిల్లా ప్రతినిధి,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడ టౌన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర, ఐపిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ముందుగా రోల్ కాల్‌ను పరిశీలించి,సిబ్బంది హాజరు, క్రమశిక్షణ, సమయపాలనపై స్పష్టమైన సూచనలు చేశారు.అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ,ఈ సంవత్సరం వారి వ్యక్తిగత ఆశయాలు ఏమిటో అడిగి తెలుసుకుని,ఎట్టి పరిస్థితుల్లోనూ లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకోరాదని, అలాగే ఆన్‌లైన్ గేమ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ గేమ్స్ కారణంగా పలువురు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు జరుగుతున్నాయని పేర్కొంటూ,ఇలాంటి వాటి జోలికి ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లొద్దని హెచ్చరించారు. అలాగే సిబ్బంది పిల్లలు ప్రస్తుతం ఏమి చేస్తున్నారో అడిగి తెలుసుకుని,వారి మంచి భవిష్యత్తుకు పునాది వేసే విధంగా మనం వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.విధి బాధ్యతల మధ్య సమయాన్ని కేటాయించి, సాధ్యమైనంత వరకు కుటుంబ సభ్యులతో,ముఖ్యంగా పిల్లలతో కలిసి భోజనం చేయాలని, కుటుంబానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రతి పోలీస్ సిబ్బంది శుభ్రమైన యూనిఫారం ధరించి వృత్తి గౌరవాన్ని కాపాడాలని ఆదేశించారు. తదుపరి పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు,రిసెప్షన్,రైటర్ రూమ్‌లను పరిశీలించి,స్టేషన్‌ను పరిశుభ్రంగా, సక్రమంగా నిర్వహించాలని సూచించారు.కేసుల నమోదు ,రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా,అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించి,భద్రత మరింత బలపడేలా అవసరమైన ప్రాంతాల్లో అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.బాన్సువాడ పట్టణంలో ట్రాఫిక్ పరిస్థితిని, ట్రాఫిక్ పాయింట్లను జిల్లా ఎస్పీ పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదు దారుల పట్ల బాధ్యతాయుతంగా, గౌరవంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ సిబ్బందికి సూచించారు.ప్రజల సమస్యలను మానవీయ కోణంతో అర్థం చేసుకుని,ఫిర్యాదులపై వేగంగా స్పందించి పరిష్కార దిశగా పనిచేయాలని తెలిపారు.ఈ సూచనలు సిబ్బందికి పూర్తిగా అర్థమయ్యాయా లేదా అనే విషయాన్ని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జిల్లాలో జరుగుతున్న ఆస్తి సంబంధిత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి,ఇలాంటి దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎస్ఐలు సిబ్బందికి ఆదేశించారు.నిరంతర పెట్రోలింగ్,గస్తీ,అనుమానితులపై నిఘా ద్వారా నేర నియంత్రణ సాధించి,పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం మరింత పెంపొందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.ఈ సంవత్సరం మీరు మీ లక్ష్యాలు, విజయాలను సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని జిల్లా ఎస్పీ తెలిపారు.గత సంవత్సరం శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిబద్ధతతో విధులు నిర్వహించిన ఫలితంగానే జిల్లాలో నేరాలు,దొంగతనాలు తగ్గించగలిగామని అన్నారు.ఈ విజయానికి కారణమైన మీ సమిష్టి కృషిని ప్రశంసిస్తూ,సిబ్బంది అందరినీ జిల్లా ఎస్పీ అభినందించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో డీఎస్పీ బి.విట్టల్ రెడ్డి,బాన్సువాడ టౌన్ సీఐ శ్రీధర్,బాన్సువాడ రూరల్ ఇన్స్పెక్టర్ తిరుపయ్య పాటు సంబంధిత పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి వివేక్ వెంకట్ స్వామి కలిసిను సన్మానించిన మాల సంఘ నాయకులు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, స్నేహిత ఎక్స్ ప్రెస్:** హైదరాబాద్ లోని గల రాజ్ భవన్ లో లేబర్,ఎంప్లాయ్మెంట్ ట్రైనింగ్,ఫ్యాక్టరీస్,మైనింగ్ జియాలాజి,శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి,మాల సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి నూతన శుభాకాంక్షలు తెలియచేసారు. అనంతరం దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి పొందే విధంగా అవకాశాలను కల్పించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు .ఈ కార్యక్రమంలో మాల సంఘం వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్,మాల సంఘం నాయకులు మల్లూరు సాయిలు, గున్న సాయిలు, మద్యల చేరు గైని సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## నీటి గుంతలో పడి రెండేళ్ల బాలుడు మృతి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, స్నేహిత ఎక్స్ ప్రెస్:** బాతుల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన నీటి గుంతలో పడి రెండేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది.బాలుడి తల్లి దండ్రులు,పట్టణ సీఐ నరహరి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.బుద్ధ భాస్కర్,శివలీల అనే భార్య భర్తలు సుమారు 8 నెలల నుండి కామారెడ్డి రాజీవ్ నగర్ కాలనీలో గల వారాహి ఫామ్ హౌస్ లో వాచ్మెన్ గా పనిచేస్తున్నారు.వీరికి రెండు సంవత్సరాల కొడుకు రన్విత్ కుమార్ ఉన్నాడు.అయితే రోజూ లాగే ఆడుకుంటూ సోమవారం సాయంత్రం సమయంలో రన్విత్ కుమార్ బాతుల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన గుంతలో ప్రమాదవ జారిపడిపోయాడు.అది చూసిన తల్లి శివలీల అరుపులు,కేకలు వేయగా వచ్చి చూసేసరికి బాలుడు నీటి గుంతలో శవమై ఉన్నాడు.తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుగుతున్నట్టు సీఐ నరహరి వివరించారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం

**అల్లాదుర్గం సిఐ రేణుక రెడ్డి**



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అల్లాదుర్గం ఎంపీడీవో కార్యాలయం నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు పదిహేను లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిసి రోడ్లు పనులు మంగళవారం ప్రారంభించారు. సిఐ రేణుక రెడ్డి,తాసిల్దార్ మల్లయ్య, ఎంపీడీవో వేద ప్రకాశ్ రెడ్డితో పాటు ఆయామండల సర్పంచ్లు కొబ్బరి కాయలు సీసీ నిర్మాణ పనులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శేషారెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుభాష్ రావు, ప్రధాన కార్యదర్శి బాల కిషన్,ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బలరాం,సర్పంచులు నరసింహారెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,శశిధర్ రెడ్డి, మద్దూరి సౌమ్య సురేష్‌గౌడ్, వీరన్న, సర్పంచ్ లు పాండు,శ్రీకాంత్, నాయకులు చెన్నప్ప,ప్రభు,చంద్ర శేఖర్,బేతయ్య శ్రీశైలం,సదానందం,విట్టల్ రెడ్డి, ఆంజనేయులు,మహేష్ తదితరులున్నారు.

## ఘనంగా జరిగిన మండల స్థాయి ప్రజ్ఞ పాటవ పోటీలు

**ఇబ్రహీంపట్నం, స్నేహిత ఎక్స్ ప్రెస్:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మండల స్థాయి 10వ తరగతి విద్యార్థుల ప్రజ్ఞా పాటవ పోటీలు విజయవంతంగా ముగిశాయి.ఈ పోటీలలో జెడ్పిహెచ్ఎస్ గోదూరు ప్రథమ స్థానంలో నిలువగా ఇబ్రహీంపట్నం మోడల్ స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రథమ ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు మండల విద్యాధికారి మధు కళాశాల ప్రిన్సిపల్ ఏ సంజీవ్ గారు బహుమతి ప్రధానోత్సవం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంటర్ విద్యాధికారి బి.నారాయణ,మరియు మండల అభివృద్ధి పరిషత్ అధికారి సిహెచ్ గణేష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేశారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్ తో పాటు మెమొంటోను ప్రధానం చేశారు.



## ఈఈ సత్యనారాయణ రెడ్డికి ఘన సన్మానం

- తాండూరు ఈఈ సత్యనారాయణరెడ్డికి పదోన్నతి
- ఎస్ఈగా ప్రమోషన్ పొందిన ఈఈ సత్యనారాయణ రెడ్డి
- సత్యనారాయణ రెడ్డిని ఘనంగా సన్మానించిన
- కోట్ పల్లి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మెన్ సాయిని నారాయణ రెడ్డి
- తాండూరు ప్రజలకు ఈఈ సత్యనారాయణ రెడ్డి ఎనలేని సేవలు



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

తాండూరు ఈఈగా సత్యనారాయణ రెడ్డి చేసిన సేవలు మరువలేనివని కోట్ పల్లి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మెన్ సాయిని నారాయణ రెడ్డి అన్నారు.మంగళవారం తాండూరు కార్యాలయంలో ప్రస్తుతం తాండూర్ ఈఈగా పనిచేస్తున్న సత్యనారాయణ రెడ్డి ఎస్ఈగా పదోన్నతి పొందిన సందర్భంగా శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.తాండూరు డివిజన్ లో ఈఈగా పనిచేసిన సత్యనారాయణ రెడ్డి ప్రజలకు ఎనలేని సేవలను అందించి ఇటు తాండూరు ప్రజల అటు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల మన్ననలను పొందారని అన్నారు. ఎస్ఈగా ప్రమోషన్ పొందిన సత్యనారాయణ రెడ్డి ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలను అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటి ఏఈ కృష్ణ,కాంట్రాక్టర్ జి.శ్రీనివాస్ రెడ్డి,మంబాపూర్ మాజీ సర్పంచ్ శ్రావణ్ కుమార్,నాయకులు ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## పేరూరు ఆశ్రమ పాఠశాలలో పిల్లల ద్వారా మాక్ పార్లమెంటు




**వాజేడు, స్నేహిత ఎక్స్ ప్రెస్:**

మండల కేంద్రంలో పేరూరు ఆశ్రమ పాఠశాలలో కాఫెడు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన "మాక్ పార్లమెంట్" మాక్ పార్లమెంట్ కార్యక్రమం విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించడంలో ఎంతో దోహదపడుతుంది.ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రధానాంశాలు మరియు విద్యార్థులు ప్రదర్శించిన విధి విధానాలు ఇక్కడ ఉన్నాయి.లోకసభ నిర్వహణ అసలైన లోక్ సభలో చర్చలు ఎలా జరుగుతాయి,స్పీకర్ పాత్ర ఏమిటి అనే అంశాలను విద్యార్థులు కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించారు.కేంద్ర మంత్రుల ప్రసంగాలు విద్యార్థులు ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు మరియు ప్రతిపక్ష నేతల పాత్రలు పోషించారు. దేశ సమస్యలపై మంత్రులు ఎలా సమాధానం ఇస్తారు, బిల్లులను ఎలా ప్రవేశపెడతారు అనే అంశాలను నేర్చుకున్నారు. ప్రశ్నోత్తరాల సమయం సభ్యులు అడిగే ప్రశ్నలకు సంబంధిత మంత్రులు ఇచ్చే వివరణలు, సభా మర్యాదలు పాటించడం వంటి విధివిధానాలను విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శించారు.ఈ కార్యక్రమం వల్ల ఉపయోగాలు నాయకత్వ లక్షణాలు: విద్యార్థుల్లో భయం పోయి, సభలో మాట్లాడే ధైర్యం, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి.రాజ్యాంగ అవగాహన దేశ పరిపాలన ఎలా సాగుతుంది? చట్టాలు ఎలా తయారవుతాయి? అనే విషయాలపై ప్రాథమిక అవగాహన కలుగుతుంది.వాక్చాతుర్యం ఎదుటివారి వాదనను గౌరవిస్తూనే, తమ గళాన్ని ఎలా వినిపించాలో విద్యార్థులు నేర్చుకున్నారు.ఈ సమావేశాన్ని ముఖ్య అతిథి గోడే సరోజిని అమ్మ పేరూరు సర్పంచ్ మాట్లాడుతూ.. కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ ఇలాంటి వినూత్న కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో చైతన్యం నింపడం అభినందనీయం అన్నారు.అలాగే పిల్లలు క్రమశిక్షణతో ఉండాలి మంచి చదువులు చదువుకొని ఉన్న స్థాయికి ఎదగాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లూర్థురాజు ఆదేశాల మేరకు ,పేరూరు ఆశ్రమ పాఠశాలలో పిల్లలు మాక్ పార్లమెంట్ ఏర్పాటు ఏర్పాటు చేయడం జరిగింది. హక్కులు మరియు జీవితంలో ధైర్యంగా ఉండాలని ఇష్టంగా చదవాలని మంచి ఆలోచన కలిగి ఉండాలనీ చెప్పడం జరిగింది స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బద్రి మాట్లాడడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోడ్డే సరోజిని సర్పంచ్,అలాగే శరత్, ఉపాధ్యాయులు కాపేడ్ సంస్థ కోఆర్డినేటర్ స్ గోంది హనుమంత్, కామేష్,యానిమేటర్స్ నరేష్,ఇందిర, ఉష,పద్మ ,భాస్కర్, రమాదేవి, స్వరూప,సుజల,ప్రసాద్,మరియు పిల్లల తల్లిదండ్రులు పాఠశాల విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## గ్రామ పంచాయతీ కార్యాలయం నిర్మించడం కోసం స్థలం పరిశీలన...!

**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల పరిధిలోని పిచేర్యాగడి పాత తాండలో నూతన సర్పంచ్ రామావత్ భీమి బాయి వినోద్ కుమార్,చొరవతో గత 3 నెలల క్రితం గ్రామ పంచాయతీ కార్యాలయం కొరకు రూ.20 లక్షల రూపాయలు మంజూరు చేయించడం జరిగింది.ఈ సందర్భంగా మంగళవారం నాడు జహీరాబాద్ డివిజన్ పంచాయతీ రాజ్ (డిఈ) రాంచందర్ రాథోడ్,కోహిర్ (ఎఈ) శశి కుమార్,లు తాండకు విచ్చేసి స్థానిక గ్రామ సర్పంచ్ రామావత్ భీమి బాయి వినోద్ కుమార్,పంచాయతీ కార్యదర్శి కే.శ్వేత,లతో కలసి గ్రామ పంచాయతీ నిర్మించడం కోసం స్థలం పరిశీలించారు.ఈ సందర్భంగా (డిఈ) రాంచందర్ రాథోడ్,మాట్లాడుతూ.. వెంటనే రెండు,మూడు రోజుల్లో పనులు ప్రారంభించాలని కంట్రాక్టర్ కు సూచించారు.




## కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజన తాండలకు అభివృద్ధికి మహార్ధశ

- బీటీ రోడ్డు ప్రారంభించిన స్థానిక నాయకులు
- మంచి చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం మాజీ సర్పంచ్ శేఖర్



**చౌడాపూర్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** చౌడాపూర్ మండల పరిధిలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాలమేరకు చాకల్ పల్లి రోడ్డు నుంచి చిన్న మేగ్య తండా గొప్య నాయక్ తండా వరకు బీటి రోడ్డు పనులను ప్రారంభించిన స్థానిక కాంగ్రెస్ నాయకులు ,ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, అసెబ్లీలో చిన్న మేగ్య తండా రోడ్డు గురించి మాట్లాడిన వెంటనే పనులు ప్రారంభించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..పల్లె పల్లె తాండ తాండ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతో మాత్రమే సాధ్యం అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్,శేఖర్,రాజు నాయక్, శంకర్ నాయక్,విజయ్,బూరియా రమేష్, సుధాకర్,నర్సిములు,రఘు,బద్రియ, తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో అందని ఉత్తరాలు.. పింఛన్ల కోసం పరాయి ఊళ్లకు ప్రయాణం!



**నర్సింహులపేట,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలంలోని పెద్ద నాగారం గ్రామ శివారు ప్రాంతమైన తండాలో తపాలా వ్యవస్థ దయనీయంగా మారింది. పోస్ట్‌మ్యాన్ నిర్లక్ష్యం కారణంగా సకాలంలో ఉత్తరాలు అందక, ముఖ్యంగా ఆసరా పింఛనుదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.ప్రభుత్వ సమాచారం గానీ, బ్యాంకు నోటీసులు, ఇన్సూరెన్స్ పాలసీలు ,కోర్టు నోటీసులు ,పాన్ కార్డులు మరియు ఇతర ఉత్తరాలు సమయానికి రాని పరిస్థితి ఏర్పడింది.

**తండా దాటితేనే తప్ప పని జరగదు**

నిబంధనల ప్రకారం పోస్ట్‌మ్యాన్ నేరుగా తండాకు వచ్చి ఉత్తరాలు పంపిణీ చేయాల్సి ఉండగా, వారాల తరబడి అటువైపు రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పింఛన్ కోసం వృద్ధులు, వితంతువులు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇతర ప్రాంతాలకు వ్యయప్రయాసలకోర్చి వెళ్లాల్సి వస్తోంది.నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు కూడా ఆటోల కోసం భారీగా ఖర్చు చేస్తూ పరాయి ఊర్ల చుట్టూ తిరుగుతున్నారు. తండా ప్రజలు చదువుకోని వారని, వారిని పట్టించుకోకపోయినా అడిగేవారు ఉండరనే ధీమాతో పోస్టల్ సిబ్బంది వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు.ఉన్నతాధికారులు మరియు తపాలా శాఖ అధికారులు వెంటనే స్పందించి,పెద్ద నాగారం శివారు తండాలో పోస్టల్ సేవలపై విచారణ చేసి,తమ పింఛన్లు సకాలంలో అందేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.




## నెట్ బాల్ టోర్నమెంట్ లో తృతీయ స్థానం సాధించిన బాలికలకు సన్మానం



**బిచ్కుంద ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండలం హజ్గుల్ జడ్పీహెచ్ఎస్ బాల బాలికలు మంగళవారం రోజు నిజామాబాద్ జిల్లా జడ్పీహెచ్ఎస్ తిరుమన్ పల్లిలో జరిగినటువంటి ఉమ్మడి జిల్లాల ఎస్ జి ఎఫ్ 14 ఇయర్స్ బాల బాలికల నెట్ బాల్ గవర్నమెంట్ లో జెడ్ పి హెచ్ ఎస్ హస్గుల్ బాలికల జట్టు తృతీయ స్థానం సాధించిన విద్యార్థులకు గ్రామ సర్పంచ్ నయీమ్ పటేల్ బాలికలకు శాలువాతో సన్మానం చేశారు. ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు ఉపసర్పంచ్ హప్పే మాధవ్ రావు మరియు పాలకవర్గ సభ్యులు గ్రామ పెద్దలు డాక్టర్ రాములు పాల్గొన్నారు

## సూక్ష్మ నీటిపారుదల గణన మరియు నీటి వనరుల గణన నమోదుపై గణన దారులకు శిక్షణ



**బిచ్కుంద ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నందు మంగళవారం నాడు తహసిల్దార్ గారి అధ్యక్షతన సూక్ష్మ నీటి పారుదల గణన మరియు నీటి వనరుల గణన నమోదుపై గణనదారులకు శిక్షణ కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీటి కుంటలు, చెరువులు, వివిధ సూక్ష్మ నీటి పారుదల వనరులను లెక్కించనున్నట్లు తెలిపారు. వీటిని మొబైల్ యాప్ ద్వారా క్షేత్ర స్థాయికి వెళ్లి నమోదు చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా నీటి వనరుల లభ్యత గురించి తెలియనుందన్నారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అందుకు రైతులందరూ సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీ వేణుగోపాల్ , ఏఎస్ఓ దత్తు, ఎన్యుమరెటర్స్ లు పాల్గొన్నారు.

## 75 వేల మందికి సర్జరీలు చేసి వైద్య చరిత్ర సృష్టించిన డాక్టర్ పంచలయ్య



**రాజన్న సిరిసిల్ల ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పంచలయ్య 75 వేల మందికి పైగా సర్జరీలు నిర్వహించి వైద్య రంగంలో అరుదైన ఘనతను సాధించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా అంకితభావంతో కొనసాగుతున్న ఆయన సేవలు జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయి. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ మండలం బాలరాజుపల్లి గ్రామ సర్పంచ్ నేదురి ప్రేమలత నరసయ్య డాక్టర్ పంచలయ్యను ఘనంగా సాలువతో సత్కరించారు. పేదల పక్షాన నిలబడి, ఆర్థిక స్థితిని లెక్కచేయకుండా అనేక మంది ప్రాణాలను కాపాడిన ఆయన సేవలు మరపురానివని ఆమె పేర్కొన్నారు.